27న డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ



స్థానిక ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

రాంగోపాల్‌పేట్: రసూల్‌పుర నారాయణ జోపిడి సిల్వర్ కాంపౌండ్‌లో 27న మొత్తం 328 నూతన డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ తెలిపారు. సోమవారం ఆయన జీహెచ్ఎంసీ హౌజింగ్ ఈఈ రవీందర్ డీఈ సంధ్య, సికింద్రాబాద్ తహసీల్దార్ పాండునాయక్ తదితరులతో కలిసి ఎమ్మెల్యే ఈ ప్రాంతాన్ని పర్యటించారు. ఈ నెల 27న డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీ ఉన్నందున ఎలాంటి పెండింగ్ పనులు లేకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లు ఈ కార్యక్రమానికి హాజరవుతారని చెప్పారు.

లాలాపేటలో భారీ వర్షం

జలమయమైన బస్తీలు



లాలాపేట ఇందిరానగర్‌లో భారీగా పారుతున్న వరద నీరు

లాలాపేట: తార్నాక, లాలాపేట ప్రాంతాల్లో ఆది, సోమవారాల్లో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ద్విచక్ర వాహనదారులు, ఫుట్‌పాత్ వ్యాపారులు తడిసి ముద్దైయ్యాయి. లోతట్టు ప్రాంతాలైన సత్యానగర్, ఇందిరానగర్, చంద్రబాబునగర్, శ్రీపురి కాలనీల్లోని రోడ్లన్నీ చెరువులను తలపించాయి. ప్రజల రాకపోకలకు ఇబ్బంది కల్గింది. తార్నాక, లాలాపేట ప్రధాన రహదారిలో తీవ్రమైన ట్రాఫిక్ జాం నెలకొంది.

కార్పొరేటర్ హేమ జన్మదిన వేడుకలు



సికింద్రాబాద్: సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ జన్మదిన వేడుకలను సోమవారం సికింద్రాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ సమక్షంలో నిర్వహించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు రాసూరి సునీత, లింగాని ప్రసన్నలక్ష్మి, కంది శైలజ, బీఆర్ఎస్ నాయకులు కరాటే రాజు, లింగాని శ్రీనివాస్, రాజసుందర్ తదితరులు పాల్గొన్నారు.

నియమాకం



రెవరెండ్.డా. స్టీవెన్‌ను సన్మానిస్తున్న సంఘ నాయకులు

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేట మెథడిస్టు చర్చ్ మెంబర్ రెవరెండ్ డా.స్టీవెన్ హైదరాబాద్ రీజినల్ కాన్ఫరెన్స్– ఎంసీఐ ఎగ్జిక్యూటీవ్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా లాలాపేట వినోభానగర్‌లోని మెథడిస్టు చర్చిలో సంఘ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాస్కుల కొమురయ్య, బి. కిరణ్‌కుమార్, చర్చి పాస్టర్ రెవరెండ్ నతానియేల్, సంఘ నాయకులు బాల్‌రాజు, వెంకటేష్, వసంత్,స్వరూపారాణి తదితరులున్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సోమవారం ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకి తెలంగాణ కల్లుగీత సంఘం నేతలు వినతి పత్రం సమర్పించారు. వృత్తిలో ప్రమాదాలు పెరుగుతున్నందున కార్మికులందరికీ కాటమయ్య రక్షణ కవచం ఇవ్వాలన్నారు. మూడేళ్లగా పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియో డబ్బులు రూ.12.6కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లా నందనంలో నీరా, తాటి ఉత్పత్తుల పరిశ్రమలను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. 50 ఏళ్లు పైబడిన గీత కార్మికులకు పింఛన్ అమలు చేయాలన్నారు. చెట్ల పెంపకానికి ప్రతి సొసైటీకి ఐదెకరాల చొప్పున భూమి ఇవ్వాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సంఘం నేతలు వెంకటరమణ, వెంకటనరసయ్య, జంగన్నగౌడ్, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన దేవీ నవరాత్రులు

అమ్మవార్లను దర్శించుకున్న ప్రముఖులు



హనుమాన్ ఆలయంలో లలితా హోమంలో పాల్గొన్న భక్తులు

అమీర్‌పేట: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలతో పాటు హోమం నిర్వహించారు. అమీర్‌పేట హనుమాన్ దేవస్థానంలో అభిషేకం, లలితా హోమం నిర్వహించారు. అమ్మవారిని రాజరాజేశ్వరీ దేవిగా అలంకరించినట్లు ఈఓ జయంతి తెలిపారు. అమీర్‌పేట కనకదుర్గ ఆలయంలో వేడుకలు వైభవంగా జరిగాయి.

ఎల్లమ్మను దర్శించుకున్న సినీ నటుడు బాలకృష్ణ సతీమణి

◆ తెలుగు సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధరదేవి ఎల్లమ్మను దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆమెకు అధికారులు స్వాగతం పలికారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ హైమావతి, ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ సాయి బాబాగౌడ్, పాలకమండలి సభ్యులు ఉన్నారు.



ఎల్లమ్మను దర్శించుకున్న సినీ నటుడు బాలకృష్ణ సతీమణి వసుంధరదేవి

సనత్‌నగర్: దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని అమ్మవారి ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుద్దీపాలతో శోభయమానంగా వెలుగొందుతున్నాయి. సనత్‌నగర్, అమీర్‌పేట్, బేగంపేట్, రాంగోపాల్‌పేట్, బన్సీలాల్‌పేట్ డివిజన్ల పరిధిలోని అమ్మవారి ఆలయాలు శరన్నవరాత్రుల శోభను సంతరించుకున్నాయి.



బాలాత్రిపుర సుందరి దేవి అలంకరణలో బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని భూలక్ష్మి అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో బేగంపేట కట్టమైసమ్మ అమ్మవారు



సనత్‌నగర్‌లో దుర్గాదేవిని దర్శించుకున్న కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి



బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు



అమ్మవారి సన్నిధితో బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు



రాంగోపాల్‌పేట్:అమ్మవారి ఉత్సవాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న శైలజరామయ్యార్



లాలాపేట: మాణికేశ్వర్‌నగర్‌లో పూజలో పాల్గొన్న సెవెన్ టెంపుల్ చైర్మన్ విజయ్‌కుమార్, భక్తులు



తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్లో..

బతుకమ్మ పండుగ విశ్వవ్యాప్తం

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: తెలంగాణలో పుట్టిన బతుకమ్మ విశ్వవ్యాప్తమైందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సోమవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సనత్‌నగర్ నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం బతుకమ్మ పండుగను ఎంతో ఘనంగా నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. 10 ఏళ్ల కేసీఆర్ ప్రభుత్వంలో అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలు, ట్యాంక్‌బండ్‌పై, ఎల్బీ స్టేడియంలో ఎంతో వైభవంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు జరిపిన విషయాన్ని వివరించారు. దేశ విదేశాల్లో బతుకమ్మ పండుగను నిర్వహించడం ఎంతో గర్వకారణమన్నారు. బతుకమ్మ విశిష్టతను విశ్వవ్యాప్తం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. ఈ నెల 24న పీపుల్స్‌ప్లాజాలో బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే బతుకమ్మ వేడుకలకు సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి మహిళలు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు కుర్మ హేమలత, మన్నే కవితారెడ్డి, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, మహిళా నాయకులు తుల ఉమా, సుశీలారెడ్డి, సుమిత్రానంద్, కీర్తిలత, శ్రీనివాస్‌గౌడ్, గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, హన్మంతరావు, వెంకటేషన్‌రాజు, ఆకుల హరికృష్ణ, లక్ష్మీపతి, శ్రీహరి, ఏసూరి మహేశ్, ప్రేమ్, కిషోర్, అశోక్‌యాదవ్, ప్రవీణ్‌రెడ్డి, పీయూష్‌గుప్తా, కరుణాకర్‌రెడ్డి, సురేష్‌గౌడ్, ఖలీల్, లక్ష్మి, రోజారెడ్డి, గోపీలాల్‌చౌహాన్, కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లోని సమస్యలు పరిష్కరించండి

అడ్డగుట్ట: డివిజన్‌లోని సమస్యలు పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని సికింద్రాబాద్ సర్కిల్ డీసీ ఆంజనేయులును అడ్డగుట్ట బీజేపీ నేతలు కోరారు. సోమవారం సికింద్రాబాద్‌లోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో డీసీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షురాలు గాజుల సౌందర్య మాట్లాడుతూ.. అడ్డగుట్ట లంబాడి బస్తీవాసుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అదే విధంగా మారేడ్‌పల్లి ఎమ్మార్వో కార్యాలయం నుంచి గంగా జమున హోటల్ వరకు వాటర్ పైపులైన్ పనులు చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్నాయని, త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు శారద మల్లేశ్, శివలింగం, నరేందర్, హంసరాజు, వసంత, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సికింద్రాబాద్ సర్కిల్ డీసీ ఆంజనేయులుకు వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నేతలు

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

చిలకలగూడ: కలియుగ దైవంగా ప్రసిద్ధి పొందిన సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి 48వ వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. ఆలయంలో కొలువు దీరిన పద్మావతి గోదా సమేత ప్రసన్న వెంకన్నస్వామికి పంచరాత్ర ఆగమ పద్ధతిలో ఈనెల 23 నుంచి వచ్చేనెల 2 వరకు బ్రహ్మోత్సవ వేడుకలు నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేపట్టారు. ఆలయాన్ని పుష్పాలు, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

అంకురార్పణతో ప్రారంభం

◆ బాజాభజంత్రీలు, మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్చారణలు మధ్య మంగళవారం ఉదయం 7 గంటలకు అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 24న ధ్వజారోహణం, దేవతాహ్వానం, 25న అభిషేకం, తిరుప్పావడ, శేషవాహన సేవ, 26 నుంచి వరుసగా ఒక్కోరోజు హంసవాహనసేవ, ముత్యపు కవచాలంకరణ, హనుమంతువాహనసేవ, గరుడవాహనసేవ, సింహవాహన, గజ, అశ్వవాహనసేవ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు.



శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వస్వామి ఆలయం

28న స్వామివారి కల్యాణం

◆ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 28న శ్రీవారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. అక్టోబర్ 2 దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని సర్వదర్శనం, శమీపూజ, మహాపూర్ణాహుతి, 108 కలశాభిషేకం, చక్రతీర్థం, శ్రీపుష్పయాగం, ద్వాదశారాధన నిర్వహిస్తారు.

'కంటోన్మెంట్ వాణి' ఫిర్యాదులను పరిష్కరించండి

బోర్డు అధికారులకు ఎమ్మెల్యే సూచన

కంటోన్మెంట్: 'కంటోన్మెంట్ వాణి'లో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే శ్రీగణేశ్, బోర్డు అధికారులకు సూచించారు. సోమవారం బోర్డు కార్యాలయంలో సీఈఓ మధుకర్‌నాయక్, డీఈఓ దినేశ్ కుమార్ రెడ్డి, హెల్త్, వాటర్‌వర్క్స్ విభాగాల ఉన్నతాధికారులు దేవేందర్, రాజ్‌కుమార్‌లతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇటీవల బోయిన్‌పల్లిలో నిర్వహించిన కంటోన్మెంట్ వాణిలో భాగంగా వివిధ విభాగాల వారీగా అందిన ఫిర్యాదులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నట్లుగా అధికారులకు ఎమ్మెల్యే వివరించారు. రెండోవార్డు నారాయణ జోపిడీ బస్తీలో నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఈ నెల 27న లబ్ధిదారులకు అందజేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. వీరికి తక్షణమే తాగునీరు, డ్రైనేజీ సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ముంపునకు గురైన బస్తీలు, కాలనీల్లో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఐదోవార్డు గణేశ్ నగర్‌తో పాటు నాలాకు ఇరువైపులా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు.



సీఈఓ మధుకర్ నాయక్, డీఈఓ దినేశ్‌రెడ్డి, బోర్డు అధికారులతో భేటీ అయిన ఎమ్మెల్యే

యువకుడు అదృశ్యం



గోపీకృష్ణ

అమీర్‌పేట: నిమజ్జనాకి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి ఓ యువకుడు కనిపించకుండా పోయాడు. ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటన వివరాలు ఎస్ఐ రాజు రాథోడ్ తెలిపిన ప్రకారం.. కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలం వట్లపల్లికి చెందిన వై.గోపీకృష్ణ(29) ఐదేళ్ల నుంచి ఎస్ఆర్‌నగర్ అమీర్‌పేట ఎస్టేట్‌లోని గోపీబాయ్స్ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ నెల 6న ఇంటికి ఫోన్ చేసి వినాయక నిమజ్జనానికి వెళ్తున్నాని చెప్పాడు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులకు ఫోన్ చేయకపోగా అతడి ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుంది. హాస్టల్‌కు ఫోన్ చేయగా,లేడని చెప్పటంతో ఆచూకి కోసం బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా జాడ తెలియలేదు. దీంతో సోదరుడు నాగ సతీష్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్‌తో రోడ్డు నిర్మాణం



భూమిపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

బొల్లారం: డివిజన్‌లోని 8వ వార్డు గంగపుత్ర సంఘం కార్యాలయం నుంచి కార్గిల్ వార్ హీరో లాస్ నాయక్ ఎం.వై రాంచందర్ విగ్రహం వరకు సుమారు రూ.97 లక్షల రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్‌తో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్, బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున్‌తో కలిసి భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిత్యం వేలాది మంది ప్రయాణించే ఈ దారిలోని రోడ్లు కొన్నేళ్లుగా నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్‌తో చేపడుతున్న ఈ నిర్మాణ పనులతో స్థానిక ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వేణుగోపాల్ రెడ్డి, కదిర్వన్, బాలరాజు, రామ్, శ్రీనివాస్, ప్రేమ్, హయత్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీని అభివృద్ధి చేస్తాం



స్థానిక సమస్యలను తెలుసుకుంటున్న ఆదం సంతోష్

సికింద్రాబాద్: ప్రజాసమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, బస్తీని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్ అన్నారు. సోమవారం మెట్టుగూడ డివిజన్ హమాల్ బస్తీలో స్థానిక సమస్యలపై ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా తాగునీటి కొరత, డ్రైనేజీ సమస్యలు, బస్తీ అభివృద్ధి, రోడ్ల పరిస్థితి, పాఠశాలలు, ఆరోగ్య సదుపాయాలపై స్థానిక ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం, ఆదం సంతోష్ మాట్లాడుతూ.. ప్రజలు చెప్పిన ప్రతీ సమస్యను తక్షణమే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తానన్నారు. ఈ పర్యటనలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి



ఎమ్మార్వో రాజు నాయక్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఐ నేతలు

అడ్డగుట్ట: భారీ వర్షాల కారణంగా నష్టపోయిన వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ సికింద్రాబాద్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో మారేడుపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. వరుసగా కురుస్తున్న భారీ వర్షాల మూలంగా సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో భారీగా ఆస్తినష్టం జరిగిందన్నారు. వర్షాల కారణంగా పేద ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అధికారులు ముంపు ప్రాంతాల్లో పర్యటించి నష్టపోయిన వారి కుటుంబాలకి రూ.25 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, బాధిత ప్రాంతాల్లో నష్ట నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భారీ వర్షాల కారణంగా ఇళ్లు ధ్వంసమై నిరాధారణకు గురైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తహసీల్దార్ రాజునాయక్‌కు వినతిపత్రం సమర్పించిన వారిలో సీపీఐ నాయకులు కొమురెల్లి బాబు, గౌరీ నాగరాజ్, పాకాల యాదగిరి, సయ్యద్‌గౌస్, లెనిన్, కొండల్, యాదగిరి, రవికాంత్, శ్రీనివాస్,ఖలీల్ పాల్గొన్నారు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో...



జెక్‌కాలనీ రోడ్డునెంబర్-3లోని వైష్ణవీ సన్‌రైజ్ అపార్ట్‌మెంట్ వద్ద బతుకమ్మ వేడుకలు

సనత్‌నగర్: బతుకమ్మ వేడుకలతో జెక్‌కాలనీ ప్రత్యేక శోభను సంతరించుకుంటోంది.బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. చిత్తూ చిత్తూల బొమ్మ శివుడి ముద్దుల గుమ్మా.. బంగారు బొమ్మ దొరికెనమ్మా ఈ వాడలోన.. అంటూ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దంపట్టే పాటలతో కాలనీ వీధులు హోరెత్తుతున్నాయి. జెక్‌కాలనీ ఫెడరేషన్ సహకారంతో బతుకమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం రోడ్డునెంబర్-3లోని వైష్ణవీ సన్‌రైజ్ అపార్ట్‌మెంట్ వద్ద బతుకమ్మ వేడుకలు జరిగాయి. రంగురంగుల పూలతో అందంగా అలంకరించి తెచ్చిన బతుకమ్మలను ఒక్కచోట పేర్చి ఆడిపాడారు. కాలనీ ఫెడరేషన్ సహకారంతో బతుకమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు చింతిరెడ్డిప్రభ, ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణలతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు హాజరై పాటలకు లయబద్ధంగా సంప్రదాయ నృత్యాలు చేసి బతుకమ్మ శోభను మరింత రెట్టింపు చేశారు. కాలనీ ఫెడరేషన్ అధ్యక్షుడు మల్లు ప్రసాద్, ప్రతినిధులు సుబ్బరాజు, విశ్వనాథరాజు, సోమ వెంకట్, పూర్మానీ మల్లారెడ్డి, బిల్డర్ రాజా, రేణుమాను భాషా తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లాలాపేటలో..

లాలాపేట: బతుకమ్మ సంబరాలు తార్నాక మున్సిపల్ డివిజన్ వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. తార్నాక, లాలాపేట, శాంతినగర్, మాణికేశ్వర్‌నగర్, రవీంద్రనగర్‌లో మహిళలు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఎంగిలిపూల బతుకమ్మను రంగు రంగుల పూలతో తయారు చేసి పూజలు చేశారు. మహిళలంతా బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ పాటలు పాడుతూ ఆడుతూ సందడి చేశారు. భక్తి శ్రద్ధలతో గౌరవమ్మను పూజించి నీటిలో వదిలారు.

సంస్కృతికి ప్రతిరూపం బతుకమ్మ

బౌద్ధనగర్: బతుకమ్మ పండుగ సందర్భంగా మొదటిరోజు ఎంగిలి పూల బతుకమ్మ సంబరాలు బౌద్ధనగర్ డివిజన్‌లోని అశోక్‌నగర్‌లో బీజేపీ కంటెస్టెడ్ కార్పొరేటర్ మేకల కీర్తిహర్షకిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున వర్షాన్ని సైతం లెక్క చేయకుండా భక్తి శ్రద్ధలతో మహిళలు బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి, ఎంపీ కిషన్‌రెడ్డి సతీమని కావ్యారెడ్డి హాజరై మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేకల సారంగపాణి, హన్మంతు ముదిరాజ్, రాజు సాగర్, ప్రకాష్ గౌడ్, వనమాల, శ్రీనివాస్, భిక్షపతి, వనమాల కిరణ్, శ్యామ్ రాజ్, అశోక్, మహిళలు నాగరాణి, కరుణ, శోభారాణి, మౌనిక రెడ్డి, సౌజన్, పుష్పలత, మంగ తదితరులు పాల్గొన్నారు.



లాలాపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యరెడ్డి